శరవేగంగా రామన్నపేట రోడ్డు విస్తరణ

- రూ.8.50 కోట్లతో పనులు
- మారనున్న మండల రూపు రేఖలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

రామన్నపేటలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు

రామన్నపేట, అక్టోబర్ 16 : రామన్నపేట మండలకేంద్రంలో రూ. 8.50 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలో చిట్యాల –భువనగిరి రోడ్డులోని నలంద కళాశాల నుంచి సిరిపురం క్రాస్ రోడ్డు కొండ లక్ష్మణ్ బాపూజీ వరకు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. పాత నియోజకవర్గ కేంద్రమైన రామన్నపేట ఇప్పటి వరకు ఇరుకు రోడ్లతో దర్శనం ఇచ్చేది. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చొరవతో రామన్నపేట అభివృద్ధిలో స్పష్టమైన మార్పుతో పూర్వ వైభవం పొందుతున్నది.

రామన్నపేటలో 35.6 నుంచి 37 కిలోమీటర్ వరకు చిట్యాల– భువనగిరి రోడ్డును, 0.0 సుభాశ్ సెంటర్ నుంచి 0.5 కిలో మీటర్లు గాంధీ విగ్రహం వరకు అమ్మనబోలు రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించడానికి నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం రూ. 8.50 కోట్లు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ పూర్తి కావడంతో పనులు జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న డబ్బాలను ప్రజలు స్వచ్ఛదంగా తొలగించారు. విస్తరణలో భాగం గా కల్వర్టుల నిర్మాణ పనులను పూర్తి చేశారు. మిషన్ భగీరథ, ఇంటర్ నెట్ కేబుల్ లను కూడ పక్కకు మార్చే పనులను పూర్తి చేశారు. విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులు కొనసాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా 4.75 మీటర్ల వెడల్పుతో మట్టిని తొలగించి మెటల్‌తో నింపి రోలింగ్ చేస్తున్నారు.

రోడ్డు నిర్మాణం ఇలా....

ఇరువైపులా 7 మీటర్ల వెడల్పుతో నాలుగు లైన్ల రహదారిని నిర్మిస్తున్నారు. రోడ్డు మధ్యలో డివైడర్‌ను నిర్మించనున్నారు. బీటీ తర్వాత ఇరు పక్కలా 2మీటర్ల వెడల్పుతో మట్టితో షోల్డర్స్‌ను (అంచులు) ఏర్పాటు చేయనున్నారు. అమ్మనబోలు రోడ్డు సుభాశ్ సెంటర్ నుంచి గాంధీ విగ్రహం వరకు ఇరువైపులా రోడ్డు మధ్య నుంచి చెరో వైపు 33 ఫీట్లతో విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ విస్తరణ పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యకు చెక్ పడనుంది. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు చదువులు, వ్యాపారాల నిమిత్తం ఇక్కడ స్థిర పడుతుండడంతో పట్టణ జనాభా పెరుగుతూ విస్తరిస్తుంది.

ఇరుకు రోడ్డు సమస్యకు చెక్...

ప్రధాన రోడ్డు విస్తరణతో పాటు అమ్మనబోలు రోడ్డు విస్తరణతో పట్టణ కేంద్రంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పడనుంది. వ్యాపార, విద్యా పరంగా ముఖ్య కూడలి ప్రాంతంలో వివిధ గ్రామాల ప్రజలు వ్యాపారాల నిమిత్తం మండల కేంద్రానికి అధిక సంఖ్యలో వస్తుంటారు. దాంతో పట్టణ రోడ్డు నిత్యం రద్దీగా కనిపిస్తున్నది. పట్టణంలో ఇరుకు రోడ్డు ఉండడంతో పెద్ద వాహనాలు వచ్చినప్పుడు ట్రాఫిక్ సమస్య ఎర్పడుతుంది. ఈ రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ సమస్య తీరుతుంది.

రోడ్డు విస్తరణ హర్షనీయం

రామన్నపేట పట్టణతో పాటు చిట్యాల – భువనగిరి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించడం హర్షనీయం. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య 8.50 కోట్ల రూపాయలు కేటాయించి పనులు చేపడుతుండడంతో పట్టణ రూపురేఖలు మారిపోతున్నాయి. పెద్ద వాహనాలు వస్తే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు విస్తరణ పూర్తయితే ఇబ్బందులు తొలగి పోతాయి.పట్టణ కేంద్రానికి కొత్త శోభ సంతరించుకుంటుంది. రోడ్డుకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

–ఆముద లక్ష్మణ్, రామన్నపేట

యాదగిరిగుట్ట :కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

మోసకారి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి
- బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరిక

యాదగిరిగుట్ట, అక్టోబర్ 16 : మాయమాటలు చెబుతూ గ్రామాల్లో తిరుగుతున్న మోసపూరిత కాంగ్రెస్, బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గుండాల మండలం సీతారాంపురానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు ఆకుపత్ని ఉమేశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జోగు సోమరాజుతోపాటు 100 మంది, మోటకొండూర్ మండలం చాడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరేశ్, వీలందర్, జాకీర్, నాగిళ్ల సురేశ్, సకినాల చందు తోపాటు 50 మంది బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గొంగిడి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గత హామీలకే దిక్కు లేదని, ఇప్పుడు గ్యారెంటీలంటూ ఓట్లు దండుకునేందుకు వస్తుందన్నారు. మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఖలీల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మూగల శ్రీనివాస్, జడ్పీటీసీ కోలుకొండ లక్ష్మీరాములు, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మాటూరి కాశయ్య, సోషల్ మీడియా మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి మల్లారెడ్డి, సీతారాంపురం ఉప సర్పంచ్ పాలడుగు మల్లేశ్, యువజన విభాగం ఉపాధ్యక్షుడు మలిపెద్ది విక్రంరెడ్డి, మోటకొండూర్ మండల నాయకుడు మల్ల సిద్ధులు, నియోజకవర్గ యువజన కార్యదర్శి కంకటి నరేశ్‌గౌడ్, వంగపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ ఎండీ మహ్మద్, వార్డు సభ్యుడు వెంకటేశ్, సతీశ్, పరశురాములు పాల్గొన్నారు.

- బొమ్మలరామారం : మండలంలోని పెద్దపర్వతాపూర్ గ్రామానికి చెందిన 106 మంది కాంగ్రెస్,బీజేపీ కార్యకర్తలు యాదగిరి గుట్టలో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిని ఆయన గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డబోయిన లక్ష్మీనర్సింహ, బీఆర్ ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు జింక నరేందర్, బీఆర్ఎస్ మండల నాయకులు బాణల బాలనర్సింహ, ఈగల బాలరాజు, పిట్టల శ్రీనివాస్, బుడిగె ప్రభాకర్ పాల్గొన్నారు.

స్వామిగౌడ్‌కు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి నివాళి

చౌటుప్పల్, అక్టోబర్ 16: మున్సిపాలిటీపరిధిలోని తాళ్లసింగారం 2వ వార్డు కౌన్సిలర్ బత్తుల రాజ్య లక్ష్మి భర్త స్వామి గౌడ్ ఆదివారం మృతి చెందా రు. స్థానిక ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మృతదేహాన్ని సోమవారం సందర్శించి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

హరిహరులకు నిత్యారాధనలు

మఠంపల్లి, అక్టోబర్ 16 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో హరిహరులకు నిత్యారాధనలు అర్చకులు సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించి కల్యాణతంతు జరిపించారు. అనంతరం ఆలయ పురవీధుల్లో గరుడ వాహన సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పానుగోడులో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

గరిడేపల్లి, అక్టోబర్ 16 : మండలంలోని పానుగోడు గ్రామ ఫ్రెండ్స్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను సర్పంచ్ జోగు సరోజినీపిచ్చిరెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యువత క్రీడాస్ఫూర్తితో ఆడి పోటీలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జోగు అరవిందరెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్16 : మండలంలోని పుట్టపాక జడ్పీ ఉన్నత పాఠశాల 2002–03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మిత్రులందరూ తమ చిన్ననాటి విషయలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. అనంతర విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కారించారు. తాము చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థులు సౌండ్ సిస్టమ్, స్టీల్ వాటర్ డ్రమ్‌ను పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పందుల శ్రీను, వల్లపోజు రజనీకాంత్, ఎండీ అలీం, రామకృష్ణ, లోడే రఘు, నాతీ నరేశ్, వెంకటేశ్, కవిత, సుజాత, యాదమ్మ పాల్గొన్నారు.

నలంద కళాశాలలో బతుకమ్మ సంబురం

చౌటుప్పల్: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

చౌటుప్పల్, అక్టోబర్ 16 : చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాల అవరణంలో సోమవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల పూవ్వులను సేకరించి బతుకమ్మలను పేర్చారు. ఆనంతరం ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.విష్ణుకుమార్, చైర్మన్ బత్తుల శంకరయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలి

- ఆలేరు రిటర్నింగ్ అధికారి వీరారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

యాదగిరిగుట్ట, అక్టోబర్ 16 : పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు కావాల్సిన కనీస సౌకర్యాలు కల్పించాలని ఆలేరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ వీరారెడ్డి సూచించారు. సోమవారం యాదగిరిగుట్ట ఎంపీడీఓ కార్యాలయంలో సెక్టోరియల్, బూత్ లెవల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితాపై వచ్చే క్లెయిమ్స్, అభ్యంతరాలను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలు అనుసరించి అన్ని స్థాయిల్లోని సిబ్బందికి లోపాలు లేకుండా విధులు నిర్వహించి ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డి, తాసీల్దార్ వెంకటేశ్వర్లు, సెక్టోరియల్ అధికారులు, బీఎల్ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

పూజల్లో పాల్గొన్న భక్తులు

చౌటుప్పల్, అక్టోబర్16 : మున్సిపాలిటీపరిధిలోని లింగోజిగూడెం సిరంగిపురం ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం మూడోరోజు ఘనంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, అమ్మవారి యంత్ర ప్రతిష్ఠ, మహా పూర్ణహుతి, కుంభ దర్శనం, నేత్రోన్యాసం, వేదాశీర్వచనం,పండిత ఆశ్వీచరనం, అన్నప్రసాదం చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బండ మీది మల్లేశ్, మాజీ సర్పంచులు ఎర్రగోని నర్సింహ యాదవ్, రమణగోని శంకర్, ఊదరి నర్సింహ, దివీస్ పరిశ్రమ జీఎం పెండ్యాల సుధాకర్, హెచ్ ఆర్ శివప్రసాద్, నాయకులు ఎర్రగోని లింగస్వామి యాదవ్ పాల్గొన్నారు.